క్లుప్తంగా

నేడు అమర్‌నాథ్ నామినేషన్



గాజువాక : వైఎస్సార్ సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థిగా గుడివాడ అమర్‌నాథ్ బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం పది గంటల ప్రాంతంలో అమర్‌నాథ్ మిందిలోని తన నివాసం నుంచి ర్యాలీగా బయల్దేరి జింక్ గేటు మీదుగా కొత్తగాజువాక జంక్షన్‌లోని వైఎస్ విగ్రహానికి చేరుకుంటారు. అక్కడి నుంచి గాజువాక మెయిన్ రోడ్‌లో పాత గాజువాక మీదుగా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి నామినేషన్ దాఖలు చేస్తారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, గుడివాడ అభిమానులు, ప్రజలు జయప్రదం చేయాలని అమర్‌నాథ్ కోరారు.

చందన అలంకరణలో త్రిశక్తి అమ్మవార్లు



చందన అలంకరణలో శ్రీ మహాదుర్గ

ఉక్కునగరం: స్థానిక త్రిశక్తి దేవాలయంలో శ్రీమహాదుర్గ, శ్రీమహాలక్ష్మి, శ్రీమహాసరస్వతి అమ్మవార్లు మంగళవారం చందన అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. వసంత పూర్ణిమ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో ఉదయం అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో రుత్వికులు చండీ హోమం నిర్వహించారు. అనంతరం మహాదుర్గ అమ్మవారికి దమనార్చన చేశారు. పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం




ఈవో శ్రీనివాసమూర్తికి చెక్కు అందజేస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మంగళవారం నగరంలోని పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన వి.రామన్, వి.నరసింహన్ ఆచార్యులు అనే దాతలు రూ. లక్ష విరాళం అందజేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివామూర్తి దాతకు బాండ్ ఇచ్చి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

మరో రెండు నామినేషన్లు

గాజువాక : గాజువాక నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులుగా మంగళవారం మరో ఇద్దరు నామినేషన్లను దాఖలు చేశారు. సీపీఎం అభ్యర్థిగా మైలవరపు రాంబాబు, స్వతంత్ర అభ్యర్థిగా సీమకుర్తి శ్రీనివాసరావు నామినేషన్లు దాఖలు చేసినట్టు గాజువాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.లక్ష్మారెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు మొత్తం 11 నామినేషన్లు అందినట్లు ఆయన పేర్కొన్నారు.

గాంధీ విగ్రహానికి షెడ్డు ఏర్పాటు



షెడ్డు ప్రారంభిస్తున్న మంగరాజు తదితరులు

పెదగంట్యాడ: అమ్మ వాసవీ సేవా ట్రస్ట్ సహకారంతో 74వ వార్డు సిద్ధేశ్వరంలోని పాఠశాలలో గల మహాత్మా గాంధీ విగ్రహంపై షెడ్డు నిర్మించారు. ఆ షెడ్డును ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకుడు కులుకూరి మంగరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు వరదా కృష్ణ, ఎంఈవోలు శ్రీనివాస్, రమణాజీ, హెచ్ఎం ప్రసాద్ పాల్గొన్నారు.

పల్లాపై గుస్సా..!

- గాజువాక టీడీపీ అభ్యర్థి పల్లాకు సహకరించని ఆ పార్టీ సీనియర్లు
- ముఖం చాటేసిన కూటమి నేతలు
- వైఎస్సార్ సీపీ నేతల ప్రచారానికి విశేష స్పందన



అచ్చెన్నాయుడుకు ఫిర్యాదు చేస్తున్న గాజువాక టీడీపీ నాయకులు (ఫైల్)



పల్లా శ్రీనివాసరావు ఇంటింటి ప్రచారంలో కనిపించని జనం (ఫైల్)

గాజువాక : గాజువాక టీడీపీలో ముసలం నెలకొంది. ఆ పార్టీ సీనియర్ నాయకులు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా శ్రీనివాసరావుకు చుక్కలు చూపిస్తున్నారు. పల్లా తీరుతో విసుగు చెందిన వారంతా ఆయన ప్రచారానికి ఏ మాత్రం సహకరించకుండా ముఖం చాటేస్తున్నారు. ఆయన తీరుతో పార్టీ నష్టపోతుందని, ఇలాగే వ్యవహరిస్తే గెలవడం కష్టమే నంటూ నియోజకవర్గానికి చెందిన సుమారు 85 మంది సీనియర్ నాయకులు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడుకు ఇటీవల ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఆ పార్టీ ఆవిర్భావం నుంచి నాయకుడిగా ఉన్న టి.హర్షవర్ధన్ నాయకత్వంలో నాయకులందరూ శ్రీకాకుళం జిల్లాలో అచ్చెన్నాయుడిని కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో ఆ పార్టీలోని కార్యకర్తల్లో గందరగోళం పెరిగింది. పల్లాతో ప్రచారానికి వెళ్లాలా.. మానుకోవాలో తెలియక సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇదిలా ఉంటే పల్లా ప్రచారానికి జనం కూడా రాని పరిస్థితి నెలకొంది. ఏ వార్డులో ప్రచారం చేపడుతున్నా జనం రెండంకెలకు దాటడం లేదు. జనం ముఖం చాటేస్తుండటంతో నాయకులే అన్ని వార్డుల్లో తిరుగుతున్నారు.

కూటమి పార్టీల సహకారం పైపైనే..

మరో వైపు గాజువాక సీటు తమకు రాలేదన్న కారణంతో కూటమి మిత్రులు ఎడమొహంగా, పెడమొహంగా ఉంటున్నారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు గాజువాక టికెట్ కోసం గట్టిగా ప్రయత్నించిన విషయం తెలిసిందే. విశాఖ ఎంపీ టికెట్‌ను రాజ్యసభ సభ్యుడు జీవీఎల్‌కు కేటాయించాలని లేని పక్షంలో గాజువాక ఎమ్మెల్యే టికెట్‌ను తనకు కేటాయించాలంటూ ఢిల్లీ స్థాయిలో చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ఆయన ఎన్నికల ప్రచారంలో పెద్దగా యాక్టివ్‌గా కనిపించడం లేదు. జనసేన నాయకులూ అదే దారిలో ఉన్నారు. గాజువాక టికెట్‌ను ఆ పార్టీ పీఏసీ సభ్యుడు కోన తాతారావు సహా పలువురు నాయకులు ప్రయత్నించినా సఫలం కాలేకపోయారు. దీంతో వారంతా ప్రచారానికి దాదాపుగా దూరంగా ఉంటున్నారు. గాజువాకలో జరిగిన చంద్రబాబు ప్రచారంలోనూ కూటమి మిత్రులు పెద్దగా కనిపించలేదు.

వైఎస్సార్ సీపీ ప్రచారంతో టీడీపీ బెంబేలు

నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ చేపడుతున్న ఎన్నికల ప్రచారం టీడీపీ నాయకుల్లో గుబులు పుట్టిస్తోంది. తనను అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచి అమర్‌నాథ్ నియోజకవర్గంలోని అటు ప్రజల్లోనూ, ఇటు పార్టీ శ్రేణుల్లోనూ జోష్ నింపుతున్నారు. ఏ వార్డులో ప్రచారం తలపెట్టినా వందల సంఖ్యలో జనం హాజరవుతున్నారు. మహిళలు భారీ సంఖ్యలో వచ్చి ప్రచారంలో పాల్గొంటున్నారు. పార్టీలోని నాయకులందర్నీ ఏకతాటిపైకి తీసుకొచ్చి ప్రచారం కొనసాగిస్తున్నారు. ప్రజలను ఇంటింటికీ వెళ్లి కలుస్తూ.. గడిచిన ఐదేళ్ల కాలంలో సీఎం జగన్ చేసిన మంచిని వివరిస్తూ ఓట్లను అడుగుతున్నారు. ఈ ప్రచారం టీడీపీ నాయకులను ఆందోళనకు గురి చేస్తోంది. ఓ పక్క పల్లా శ్రీనివాసరావు తన పద్ధతిని మార్చుకోకపోవడం, మరో పక్క టీడీపీ సీనియర్ నాయకులు తిరుగుబావుటా ఎగరవేయడం, కూటమి నేతలు మిన్నకుండిపోవడం, జనం నుంచి కూడా కనీస స్పందన లేకపోవడం ఆ పార్టీ నేతలను కలవరపెడుతోంది. గెలుపుపై ఉన్న భ్రమలు క్రమంగా తొలగిపోతున్నాయి.

సంక్షేమ ప్రదాతను మళ్లీ సీఎం చేద్దాం

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపిద్దాం
- పార్టీ నాయకుల విస్తృత ప్రచారం



74వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు



కణితి గవర వీధిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గాజువాక : పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేసి, వారి జీవితాల్లో వెలుగు రేఖలు నింపిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పాలనను ప్రజలకు చేరువ చేసి సేవలను సులభతరం చేసిన నాయకుడికి విజయం చేకూర్చాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నేతలు విస్తృత ప్రచారం చేస్తున్నారు.

- 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం కణితి గవర వీధిలో ప్రచారం నిర్వహించారు. కాలనీలోని ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అమర్‌నాథ్ గెలిస్తే గాజువాకను ఆదర్శంగా అభివృద్ధి చేస్తారని వివరించారు. అమర్‌నాథ్ తాత అప్పన్న, తండ్రి గురునాథరావు ఈ ప్రాంత అభివృద్ధికి చేసిన కృషిని నివాసులకు తెలియజేశారు. వారి వారసుడిగా, వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అమర్‌నాథ్‌కు కూడా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. గడిచిన ఐదేళ్లలో ఎమ్మెల్యే నాగిరెడ్డి హయాంలో గాజువాకలో 2వేల కోట్ల సంక్షేమ పథకాలు, రూ.500 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులను చేపట్టారని, అమర్‌నాథ్‌ను గెలిపిస్తే గాజువాకను అన్ని రంగాల్లోను అభివృద్ధి చేస్తారని తెలియజేశారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకోవడం కోసం వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద్, పిన్నింటి సంతోష్, ఆదారి శ్రీను, గాలి ఆనంద్, కాండ్రేగుల కనకలక్ష్మి, దుగ్గపు నర్సింహమూర్తి, మెంటే సునీల్, బుగిడి రామలక్ష్మి, ముద్దపు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

74వ వార్డు సిద్ధేశ్వరంలో...

పెదగంట్యాడ: గాజువాక నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌కు ఓటేసి గెలిపించాలని ఆ పార్టీ మహిళా నాయకులు కోరారు. జీవీఎంసీ 74వ వార్డు సిద్ధేశ్వరంలో వారు మంగళవారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్‌ను, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గొరుసు రామలక్ష్మి, ఒమ్మి ఈశ్వరి, విమలా థామస్, విజయలక్ష్మి, సంతోషి పాల్గొన్నారు.

1167వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద కొనసాగుతున్న రిలే దీక్షలు మంగళవారం నాటికి 1167వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన కోక్‌ఓవెన్ విభాగ కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ పరిశ్రమల వలన దేశంలో ఆర్థికాభివృద్ధి మెరుగుపడిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉండాలన్నారు. కార్మిక హక్కులు అమలు కావాలన్నా, నిర్వాసితులకు న్యాయం జరగాలన్నా విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని కోరారు. కార్యకమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

హనుమాన్ విజయోత్సవ దీక్షలు ప్రారంభం



హనుమాన్ దీక్షలను ప్రారంభిస్తున్న అర్చకులు

అగనంపూడి: అగనంపూడి జాతీయ రహదారి కూడలిలోని వీరాంజనేయస్వామి ఆలయంలో మహావీర్ హనుమాన్ జయంత్యుత్సవాలను వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం హనుమాన్ విజయోత్సవాల దీక్షలను ప్రారంభించారు. ఆలయ అర్చకులు రవికుమార్ మాట్లాడుతూ గతంలో ఈ కూడలిలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూ ఉండేవని, దీంతో లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆలయాన్ని నిర్మించిన అనంతరం ఇక్కడ ప్రమాదాలు తగ్గాయని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులు కేటాయించాలి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

- శాలివాహన సంఘం ప్రతినిధుల విజ్ఞప్తి
- మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్‌తో ఆత్మీయ సమావేశం

అక్కిరెడ్డిపాలెం: కుమ్మరులకు రాజకీయంగా నామినేటెడ్ పదవులు కేటాయించాలని శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఎం.పురుషోత్తం కోరారు. ఈ మేరకు మంత్రి, గాజువాక ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్‌కు విజ్ఞప్తి చేశారు. 68వ వార్డు మింది గుడివాడ అప్పన్న కల్యాణ మండపంలో మంగళవారం రాత్రి శాలివాహన సంఘం ప్రతినిధుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమ్మరులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పురుషోత్తం మంత్రి అమర్‌నాథ్ దృష్టికి తీసుకువచ్చారు. కుమ్మర్లకు మట్టి సమస్య పరిష్కారం, ఆర్కే బీచ్ వద్ద కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ విగ్రహం ఏర్పాటు తదితర అంశాలను మంత్రికి తెలియజేశారు. దీనిపై స్పందించిన అమర్‌నాథ్ మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో శాలివాహనుల అభ్యున్నతికి సీఎం జగన్ ఎంతో కృషి చేశారన్నారు. కుమ్మరుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా శాలివాహన సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ఎన్నికల్లో అమర్‌నాథ్ విజయానికి సహకారం అందిస్తామని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ డి.అర్జున్ వెంకట్రావు, డి.చిరంజీవి రావు, గౌస్, రొంగలి జగన్నాథం, ఎం.రాజు, ఎస్.లక్ష్మణరావు, ఎస్.భాస్కరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమాంబ జాతర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు డొంకాడ నిర్వాసిత కాలనీవాసుల ఇలవేల్పు దుర్గమాంబ అమ్మవారి జాతరను ఈ నెల 25న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు గ్రామంలోని కమ్యూనిటీ హాలు వద్ద ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా 24వ తేదీ సాయంత్రం జోడు ఘటాల ఊరేగింపు, బల్లవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన అనంతరం రామాలయం వద్ద కోటి దీపారాధన చేపట్టనున్నట్లు చెప్పారు. 25న అనుపు మహోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఆలయ, ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశాయని కమిటీ ప్రతినిధులు దాసరి త్రినాథరావు, బొబ్బరి అప్పారావు చెప్పారు. కార్యక్రమంలో దాసరి సన్యాసిరావు, అట్టా అప్పారావు, బల్ల సత్తిబాబు, దాసరి నాయుడు, కరణం పెంటారావు, సీహెచ్.దుర్గారావు, వై.గణేష్, డి.రవి, ఐ.పెంటారావు పాల్గొన్నారు.

సిరులతల్లికి స్వర్ణ పుష్పార్చన

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వి. రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా బౌర్రమాంబ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో బౌర్రమాంబ అమ్మవారు



అనుపు ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

అగనంపూడి: అగనంపూడి పరిసర ఎనిమిది గ్రామాల ప్రజల ఆరాధ్యదైవం బౌర్రమాంబ అమ్మవారి జాతరను మంగళవారం కనులపండువగా జరిపించారు. వేలాది మంది భక్తులు తెల్లవారుజామునే అమ్మవారి వనం వద్దకు చేరుకొని విశేష పూజలు చేశారు. అమ్మవారికి పసుపు, కుంకుమలతో పాటు చీర సారె సమర్పించారు. పండగ సందర్భంగా అమ్మవారి వనం నుంచి గ్రామం వరకు రోడ్లన్నీ విద్యుద్దీపాల వెలుగులతో నిండిపోయాయి. ప్రతీ ఇల్లు బంధువుల, స్నేహితుల రాకతో కళకళలాడుతూ పండగ వాతావరణం కనిపించింది. సాయంత్రం అమ్మవారిని భారీ ఊరేగింపుగా తీసుకువెళ్లారు. వనం ఆవరణలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్, ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వాలకాలు వృద్ధునికి సత్కారం

ఉత్సవాల సందర్భంగా ఏటా వాలకాలు వేస్తూ, ఉత్సవాల్లో పాల్గొనే వారిని కడుపుబ్బా నవ్విస్తున్న హాస్యనటుడు, బండ్ల వేషధారి గొల్లవిల్లి బొరయ్యను మహాత్మాగాంధీ సేవా సంఘం సత్కరించింది. వేషధారణ, భాష, హాస్యనటనతో నాలుగు దశాబ్దాలుగా ఆయన అందిస్తున్న సేవలను అతిథులు కొనియాడారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు చిత్తా రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలమాంబ జాతర



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు



విశేష అలంకరణలో పోలమాంబ అమ్మవారు

ఏయూ క్యాంపస్: శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర మంగళవారం వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పెదవాల్తేరులోని ప్రధాన ఆలయంలో అమ్మవారిని వేలాది మంది దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను ఆలయ ఈవో గాయత్రి సిబ్బంది సహకారంతో చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక క్యూలైన్లు, ఎండ తగలకుండా టెంట్‌లు వేశారు. మంచినీరు, మజ్జిగ, పాలు వంటివి పంపిణీ చేశారు. ఆరోగ్య కేంద్రాన్ని సైతం ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష పర్యవేక్షించారు. ఈ నెల 14న అమ్మవారి పండగ ప్రారంభమై పుట్టబంగారం తేవడం, అమ్మవారిని ప్రధాన ఆలయం నంచి పెదవాల్తేర్ మద్దివారి పెద్దింటికి తీసుకురావడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పండగలో భాగంగా ఘటాలు, నేలవేషాలు, పులివేషాలు, గరిడీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ



అధ్యాపకులతో క్యాన్సర్ వైద్య నిపుణురాలు డాక్టర్ సంగీత్‌మఠ్

అగనంపూడి: క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించడం ద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడేందుకు అవకాశం ఉంటుందని క్యాన్సర్ వైద్య నిపుణురాలు డాక్టర్ సంగీత్‌మఠ్ అన్నారు. ముందుగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్యాన్సర్‌పై గొన్నా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో క్యాన్సర్ కారకాలు, వాటి నివారణోపాయాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఎక్కువగా క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. ఇందుకు కారణం వారు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోపోవడమేనన్నారు. ఇప్పటికైనా ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో గొన్నా విద్యా సంస్థల డైరెక్టర్ గొన్నా హేమ్‌చంద్ నాయుడు, ప్రిన్సిపాల్ మూర్తి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గిరి పద్రక్షిణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: వసంత పౌర్ణమి వేళ భక్తులు భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ నిర్వహించారు. స్థానిక సెక్టార్-1లో వేంకటేశ్వర స్వామి కొలువుదీరిన ఆలయ గిరి ప్రదక్షిణ చేశారు. మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమైన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గోవింద నామ స్మరణతో గిరి మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, హరిస్వామి నేతృత్వంలో భక్తులు ప్రదక్షిణ పూర్తి చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కార్మికులకు సన్మానం



ఉద్యోగ విరమణ చేయనున్న కార్మికులను సన్మానిస్తున్న ఓబీసీ అసోసియేషన్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ)లో పలు విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు కార్మికులు బుధవారం ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా ఓబీసీ అసోసియేషన్ ప్రతినిధులు వారిని ఘనంగా సన్మానించారు. సంస్థ ఓబీసీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎల్ఎంఎస్ విభాగం కార్మికుడు కె.శ్రీనివాసరావు, సీఎస్‌పీ1 విభాగం కార్మికుడు పి.వి.అప్పారావు, సివిల్ విభాగం కార్మికుడు ఎ.గంగాధరరావును ఘనంగా సన్మానించారు. సంఘం కార్యదర్శి ఉరుకూటి బాబూరావు ఆధ్వర్యంలో అధ్యక్షుడు సీతంనాయుడు, అల్లు అప్పారావు, వారాడ ఆనందరావు, చిట్టిబాబు, కనకారావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా చైత్ర పౌర్ణమి పూజలు

కంచరపాలెం: ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఏకాంత ఆలయంలో కార్తికేయ శరవణ ట్రస్టు ఆలయ ధర్మకర్త దేవాల రాజు(కృష్ణ)ఆధ్వర్యంలో మంగళవారం చైత్రమాస బహుళ పూర్ణిమ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామకృష్ణ శర్మ నేతృత్వంలో సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. పురవీధుల్లో సుబ్రహ్మణ్య స్వామిని ఊరేగించారు. సాయంత్రం శ్యామల అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చొక్కాకుల కుమారి, కడగల జ్యోతిష్, కార్యదర్శి కాండ్రేగుల రాము, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.